క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



జల్లివారిపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు

రామచంద్రపురం: ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం సీఐ పి.దొరరాజు హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా బయట వ్యక్తుల ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇందులో భాగంగా పట్టణ ఎస్సై కె.సురేష్‌బాబు నేతృత్వంలో పట్టణంలోని జల్లివారిపేటలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సరైన రిజిస్ట్రేషన్ లేని 14 మోటారు సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మోటారు సైకిళ్లను స్టేషన్‌కు తరలించామని, సంబంధిత వాహనదారులు వాహన పత్రాలను తీసుకు రావాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం కాలనీవాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

4న చెయ్యేరులో ఎన్నికల ఓట్ల లెక్కింపు



ఆర్వో సుధాసాగర్

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే నెల 4న చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద బ్లాక్ వద్ద కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేశామని రామచంద్రపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కౌంటింగ్ ప్రక్రియ నిమిత్తం మొత్తం 10 టేబుళ్లను ఏర్పాటు చేసి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, సహాయకుల చొప్పున సిబ్బందిని నియమించామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో 10 టేబుళ్లలో 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నిమిత్తం ఒక టేబుల్‌ను, ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నిమిత్తం మరో టేబుల్‌ను ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఏర్పాటు చేశామని ఆర్వో వివరించారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



తామరపల్లి ప్రారంభంలో ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. రెండు చోట్ల ప్రమాదకర మలుపులు, పక్కనే చెరువు ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా స్పీడ్‌గా వెళ్తున్నాయి. రహదారి నిర్మించినప్పటి నుంచి వేగానికి హద్దే లేకుండా పోతోంది. అధికారులు స్పందించి ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్ల సీజ్



మట్టి తవ్వకాలను అడ్డుకున్న తహసీల్దార్ ప్రశాంతి

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రు శివారు చీకురుమిల్లి వారి పేట సమీపంలో మట్టిని అక్రమంగా తవ్వుతున్న జేసీబీతో పాటు మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. గ్రామంలో సీతారామ దేవస్థానానికి చెందిన భూమిలో మట్టి అక్రమ తవ్వకాలపై స్థానికులు కాట్రేనికోన తహసీల్దార్ డి.ప్రశాంతికి ఫిర్యాదుచేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఆమె మట్టి తవ్వకాలను అడ్డుకుని అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్న జేసీబీ, మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి చండీ హోమం ఘనంగా జరిగింది. ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని గురువారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ పారాయణ, చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నేటి నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- టెన్త్, ఇంటర్ విద్యార్థుల కోసం..
- క్లస్టర్ పరిధిలో పూర్తయిన ఏర్పాట్లు



బెంచీలపై హాల్ టిక్కెట్ల నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

రాయవరం: టెన్త్, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల విద్యార్థులు రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌కు కూడా ఈ రెండు పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని ఐదు మండలాల టెన్త్ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 617 మంది, మండపేటలో ఏర్పాటు చేసిన మరో మూడు పరీక్ష కేంద్రాల్లో 537 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు.

ఇంటర్‌కు ఐదు పరీక్ష కేంద్రాలు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2,916 మంది, ఆదిత్య జూనియర్ కళాశాలలో 2,346 మంది, శ్రీవైష్ణవి ఒకేషనల్ జూనియర్ కళాశాల్లో మంది 1,701 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే రామచంద్రపురంలోని వీఎస్ఎం జూనియర్ కళాశాలలో 1,949 మంది, రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2,337 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం పూట పరీక్షలు మాత్రమే జరుగుతాయి. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 476 మంది పరీక్షలు రాయనున్నారు. రాయవరం పరీక్ష కేంద్రంలో మాత్రం రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల హాల్ టికెట్లు ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేశారు. వ్యక్తిగతంగా కూడా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ఇంటర్మీడియట్ బోర్డు కల్పించింది. మార్చి 1 నుంచి నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల రెండు సెట్లలో ఒక సెట్‌ను లాటరీ విధానంలో సప్లిమెంటరీ పరీక్షలకు వినియోగిస్తారు. ఒకేషనల్ విద్యార్థుల విషయంలో కొత్త సెట్‌ను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయగా, స్టోరేజ్ పాయింట్లలో భద్రపర్చారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం



పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ముఖ్యంగా తాగునీరు, ఫర్నిచర్, టాయిలెట్లు వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చాం. విద్యార్థులు అరగంట ముందుగానే కళాశాలకు చేరుకోవాలి. ఇన్విజిలేటర్ల నియామకానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం.

– శ్రీపాద లక్ష్మీనరసింహ, ఉప విద్యాశాఖాధికారి, రామచంద్రపురం

హాల్ టిక్కెట్లు పంపిణీ చేశాం



ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. హాల్ టిక్కెట్లను ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తున్నాం. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండపేట

అపరాలపై పల్లాకు తెగులు



కాజులూరులో పల్లాకు తెగులు సోకిన పెసర పైరు



పల్లాకు తెగులు సోకిన మినప మొక్క

- రైతుల్లో గుబులు
- సస్యరక్షణ అవసరమంటున్న అధికారులు

కాజులూరు: అపరాల పంటకు పల్లాకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో మాగాని పంట పొలాల్లో రైతులు మూడో పంటగా పెసర, మినుము వంటి అపరాలను పండిస్తున్నారు. ఈ ఏడాది వరి పంట ముందుగా మాసూళ్లు చేసిన రైతులు అక్కడక్కడా అపరాల పంట వేశారు. వాతావరణం అనుకూలించక పోవటంతో దాదాపు అన్నిచోట్లా అపరాల పంటకు పల్లాకు తెగులు ఆశిస్తుంది. దీంతో పూత, పిందె లేకుండానే మొక్క పండిపోయి చనిపోతుందని రైతులు వాపోతున్నారు.

నివారణ చర్యలు ఇలా..

జమినీ వైరస్ కారణంగా పల్లాకు తెగులు వస్తుందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. సూక్ష్మంగా ఉండే తెల్లదోమలు పల్లాకు తెగులు ఉన్న ఆకుపై వాలి మరో ఆకుపైకి వెళ్లడంతో వాటి కాళ్ల ద్వారా ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. పంటపై పల్లాకు తెగులు సోకితే ఆకులన్నీ పసుపు రంగులోకి మారి మొక్కలు ఆహారం తయారు చేసుకోలేవన్నారు. దీంతో దిగుబడి తగ్గిపోతుందన్నారు. ముఖ్యంగా పొలం గట్లపై ఉండే కలుపు మొక్కల ద్వారా ఒక పంట నుంచి మరో పంటకు వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ తెగులు సోకిన కలుపు మొక్కలను అపరాల మొక్కలను ముందుగా గుర్తించి పొలం నుంచి తొలగించి తగులబెట్టాలన్నారు. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.25 మిల్లీలీటర్లు కాని, మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు కాని, పాపినోఫాస్ 1.5 మిల్లీలీటర్లు కాని, ఎసిపెట్ ఒక గ్రాము కాని, ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు కాని, లీటరు నీటికి కలిపి రెండు వందల లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు. దోమ ఉధృతిని బట్టి 10–15 రోజుల వ్యవధిలో మందును మార్చి మరోసారి పిచికారీ చేసుకోవాలని అన్నారు. రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను రక్షించుకోగలిగితే మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి అశోక్ వివరించారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌ను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి, మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గ్రామాలకు చెందిన మాల సామాజిక వర్గ నాయకులు, కార్యకర్తలు పిల్లి సూర్యప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ లభించిందన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు కలిగిన విశ్వాసం, పార్టీ పట్ల వారికి గల అభిమానంతో నియోజకవర్గం, రాష్ట్రంలోనూ ఘన విజయం సాధిస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తిగా విశ్వాసం చాటుకున్నారన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేసేందుకు ఓటేశారన్నారు. కార్యక్రమంలో ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, పార్టీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాత నూకరావు, ఎస్సీ నాయకులు పోతు శ్రీనివాసు, పోతుల మాధవ, సత్తిబాబు, మేకల శ్రీనివాసు, రేవు నాగేశ్వరరావు, జంగం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేల కొరిగిన విద్యుత్ లైన్లు



మండపేట వడ్డావారి తోటలో తెగిపడిన విద్యుత్ వైర్లు

పునరుద్ధరించాలని రైతుల వినతి

మండపేట: ఇటీవలి సంభవించిన వర్షాలు, ఈదురు గాలులకు పట్టణంలోని పలుచోట్ల విద్యుత్తు లైన్లు దెబ్బతిన్నాయి. చెట్ల కిందే విద్యుత్ లైన్లు ఉండడంతో బలంగా వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు, కొన్నిచోట్ల చెట్లు సైతం నేలకొరిగాయి. ఇవి కిందనే విద్యుత్తు సరఫరా అయ్యే తీగలపై పడడంతో ఎక్కడికక్కడే విద్యుత్ వైర్లు తెగి పడడమే గాకుండా కొన్నిచోట్ల స్తంభాలు కూడా కింద పడ్డాయి. ముఖ్యంగా పంట పొలాల్లో ఈ నష్టం ఎక్కువగా కనిపిస్తోంది. వారం క్రితం సంభవించిన తుఫానుకు గొల్లపుంత రోడ్డులోని టిడ్కో , వైఎస్సార్ కాలనీలకు వెళ్లే మార్గంలో విద్యుత్తు లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్తు శాఖాధికారులు తక్షణమే స్పందించి కాలనీకి సరఫరాను పునరుద్ధరించారు. అయితే పొలాల్లో పడిపోయిన విద్యుత్ లైన్లను మాత్రం వారు ఇప్పటికీ పట్టించుకోలేదు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు పనులు మొదలు కానున్నాయి. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆ మరమ్మతులను కూడా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. గొల్లపుంత రోడ్డులోని వడ్డా వారి తోట, ఆ పక్కనే ఉన్న పుంతగట్ల వద్ద పలు విద్యుత్తు వైర్లపై కొబ్బరి చెట్లు పడి స్తంభాలు ఒరిగి పోయాయి. అంతేగాకుండా విద్యుత్తు వైర్లు తెగి పంట చేలో పడిపోయాయి. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు దృష్టికి ‘సాక్షి’ తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షం కురిసిన కారణంగా పుంతగట్లు మెత్తబడి పోయాయని దాని వల్ల ట్రాక్టర్ ఇతర మరమ్మతు వాహనాలు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. ఎండ కాసిన అనంతరం పొలాల్లో పడిపోయిన విద్యుత్తు లైన్లను పునరుద్ధరించి, బోర్లకు సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

పీఠంలో వైశాఖ పౌర్ణమి పూజలు



పుష్పాలంకృతులైన విజయదుర్గ అమ్మవారు

రాయవరం: వెదురుపాక గ్రామంలోని విజయ దుర్గా పీఠంలో వైశాఖ పౌర్ణమి పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఇక్కడి విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామి వారికి సుప్రభాత సేవ, తులసీ దళార్చన, భవానీ శంకర అష్టమ లింగేశ్వర స్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి లలితా సహస్రనామాలు, లలితా, దుర్గా, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో విజయదుర్గ అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్)ఆశీస్సులు పొందారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ



హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు

- జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ

మండపేట: జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ విజయోత్సవ ర్యాలీలను, బాణసంచా కాల్పులను నిషేధించామని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ స్పష్టం చేశారు ఈ విషయాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మండపేట నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాన్ని గురువారం పట్టణంలోని సంగిత వెంకటరెడ్డి నగర్‌లోని కాపు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ జూన్ ఆరో తేదీ వరకూ బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. పోలీసు నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలన్నారు. బాణసంచా విక్రయాలనూ నిలిపివేసినట్టు చెప్పారు.

పెట్రోల్‌ను లూజుగా విక్రయించవద్దని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో మండపేట టౌన్, రూరల్ సీఐలు షేక్ అఖిల్ జమ, కొమ్ముల శ్రీధర్‌కుమార్, మండపేట టౌన్, రూరల్ ఎస్ఐలు హరికోటి శాస్త్రి, చైతన్య, రాయవరం ఎస్ఐ నగేష్, యాంకర్ ఎస్ఐ పరదేశి ఏఎస్ఐలు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు, అంగర, కాలేరు గ్రామాల్లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల నిర్వాహక కమిటీ సభ్యులు బాబాను విశేషంగా అలంకరించారు. భక్తులు బాబా ఆశీస్సుల కోసం ఆలయాలను సందర్శించారు.

గోవును సంరక్షించిన గ్రామస్తులు



గోవుకు వైద్యం అందిస్తున్న వైద్యుడు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి వాసాలతిప్పలో ఆపదలో ఉన్న గోవును గ్రామస్తులు రక్షించారు. గ్రామానికి చెందిన ఒక అనాథ ఆవు మేతకు వెళ్లి పంట బోదెలో దిగి గత రెండు రోజులుగా ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేక అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ విషయాన్ని గుర్తించిన నక్కా రామేశ్వరానికి చెందిన యువకులు ఆవును సురక్షితంగా బయటకు తీసి స్థానిక పశువైద్యాధికారి కోనే రామారావుకు సమాచారం అందించారు. రామారావు సహాయకులు గాంధీతో కలిసి ఆవుకు వైద్యం అందించారు. ఆవు ప్రాణాలను కాపాడిన యువకులను, వైద్యులను గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర జూడో సంఘ ప్యాట్రన్‌గా అప్పాజీ



అమలాపురం రూరల్: రాష్ట్ర జూడో సంఘ ప్యాట్రన్‌గా అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన చొల్లంగి అప్పాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ అడవరం నాగురయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాష్ట్ర జూడో సంఘ వార్షిక సర్వసభ్య సమావేశంలో అప్పాజీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జూడో క్రీడ కార్యాలయాలు స్థాపించి ఆడపిల్లలందరికీ ఆత్మరక్షణగా జూడో క్రీడలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అప్పాజీని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి

రాయవరం: మండలంలోని పలు విష్ణాలయాల్లో గురువారం నరసింహస్వామి జయంతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలంలోని విజయదుర్గ పీఠంలో కూడా లక్ష్మీ నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని పీఠం అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారికి పలు రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పీఠంలో భక్తుల సంక్షేమం కోరుతూ మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నరసింహ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉప్పలగుప్తంలో సినీ సందడి



ఉప్పలగుప్తంలో జాతర సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినిమా బృందం

ఉప్పలగుప్తం: మండల కేంద్రమైన ఉప్పలగుప్తంలో సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. గ్రామానికి చెందిన యువ డైరెక్టర్ మోటూరి చైతన్య సాయంకాలపు సిత్రాలు(ఎస్ఎస్) బ్యానర్‌పై దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించి జాతర సన్నివేశాలను గురువారం చిత్రీకరించారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా వికాస్, హీరోయిన్‌గా మౌనిక, విలన్‌గా రఘు కుంచే నటిస్తున్నారని నిర్మాత మోటూరి వాణి రవికుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి హైదరాబాద్, విశాఖపట్టణం, కాకినాడ, మారేడుమిల్లి ప్రాంతాల్లో దాదాపు 50 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని వివరించారు. ఆగస్టు నాటికి షూటింగ్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు సినిమాను తీసుకొస్తామని తెలిపారు.

బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష

యానాం: 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్లకు సంబంధించి కామన్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సంబంధించి సెంటాక్ అడ్మిషన్ కమిటీ నోటీసు జారీ చేసిందన్నారు. అభ్యర్థులు సెంటాక్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రాయాలని సూచించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 15 కాలేజీల్లో 880 బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది నుంచి యానాంలో 40 సీట్లతో నర్సింగ్ కాలేజీని ప్రారంభించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు.

వీఆర్వో అందుబాటులో లేక ఇబ్బంది

కాజులూరు: బందనపూడి వీఆర్వో అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ జక్కన రాజేష్ తదితరులు అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ఇక్కడ వీఆర్వోగా పనిచేసిన సూర్యచంద్రరావు ఒక రైతు నుంచి పట్టాదారు పాసుపుస్తకం మంజూరుకు లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారన్నారు. దీంతో ఇక్కడ కోలంక వీఆర్వోగా పనిచేస్తున్న శ్రీపాదం సూర్యనారాయణ (సూరిబాబు)ను ఇన్‌చార్జిగా నియమించారన్నారు. అప్పటి నుంచి సూరిబాబు అడపాదడపా గ్రామానికి వచ్చి వెళ్తున్నారే తప్ప రైతులకు అందుబాటులో ఉండటం లేదని వారు ఆరోపించారు. దీనిపై సంబంధిత వీఆర్వో సూరిబాబును వివరణ కోరగా తాను పనిచేస్తున్న కోలంక నుంచి బందనపూడికి 20 కిలోమీటర్లు దూరం ఉంటుందని, రోజూ ఇక్కడికి వచ్చి వెళ్లలేకపోతున్నానన్నారు. ఈ విషయాన్ని మండల తహసీల్దార్‌కు తెలియజేశానన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: పవిత్ర వైశాఖ పౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా చొల్లంగిపేట గ్రామానికి చెందిన నరాల అప్పారావు, లక్ష్మీ రుక్మిణి దంపతులతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.